

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్‌రెడ్డి గురువారం సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి శాలువాతో సన్మానించారు. భువనగిరి నియోజకవర్గ కాంగ్రెస్ ఎంపీగా చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేసిన మధుసూదన్‌రెడ్డిని సీఎం అభినందించారు.



చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డికి అభినందనలు తెలియజేస్తున్న గుర్రంగూడ కార్పొరేటర్లు లక్ష్మారెడ్డి, శంకర్ తదితరులు

బీజేపీ ఎంపీలకు నేతల శుభాకాంక్షలు



ఎంపీ డీకే అరుణకు శుభాకాంక్షలు తెలుపుతున్న శ్రీరాములుయాదవ్ తదితరులు

సరూర్‌నగర్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఇటీవలి ఎన్నికల్లో విజయం సాధించిన పలువురు బీజేపీ ఎంపీలను గురువారం బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్లకు చెందిన బీజేపీ నేతలు, ప్రజాప్రతినిధులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్, నియోజకవర్గం కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, బడంగ్‌పేట్ శాఖ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి తదితరులు మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసి బొకే అందజేసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఇక బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని గుర్రంగూడ 6,7 డివిజన్ల కార్పొరేటర్లు దడిగ శంకర్, గడ్డం లక్ష్మారెడ్డి పార్టీ నేతలతో కలిసి చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొలన్ శంకర్‌రెడ్డి చేవెళ్ల ఎంపీ కొండాను ఆయన నివాసంలో కలిసి పూలమాల, శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. పార్టీ నాయకులు రామిడి మహేందర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, భిక్షపతిచారి, రాజశేఖర్, పున్న భిక్షపతి, జంగారెడ్డి, వెంకటేశ్, శ్రీశైలం పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి కృషి: కార్పొరేటర్

వనస్థలిపురం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. వనస్థలిపురం డివిజన్‌లోని పలు కాలనీల్లో డ్రైనేజీలు పొంగుతున్నాయని కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకవచ్చారు. ఈ మేరకు సంబంధిత అధికారులతో కలిసి కార్పొరేటర్ డ్రైనేజీ సమస్యలను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకవస్తే పరిష్కరిస్తానన్నారు. రాబోయే వర్షా కాలాన్ని దృష్టిలో పెట్టుకుని కాలనీవాసులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ ప్రజ్ఞ, జలమండలి అధికారులు, మున్సిపల్ సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.



కాలనీ ప్రతినిధులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

బాలాజీనగర్‌కాలనీ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం : కార్పొరేటర్ పవన్‌కుమార్

కొత్తపేట, జూన్ 6(ఆంధ్రజ్యోతి): బాలాజీనగర్ కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన కాలనీ రోడ్ నెం.4, 5లలో పర్యటించారు. సుమారు 3సంవత్సరాల క్రితం ఈ దారుల్లో ఎక్కువ సామర్థ్యం గల డ్రైనేజీ పైప్‌లైన్ల నిర్మించడంతో చిన్న పైప్‌లైన్‌తో కలుపడంతో సమస్య మొదలైందని కాలనీ ప్రతినిధులు ఆయనకు విన్నవించారు. సంస్కృతీ సన్వార్ అపార్టుమెంట్ ప్రాంతం నుంచి బాలాజీనగర్ 6వ నెంబర్ రోడ్డులో గల పైప్‌లైన్‌తో అనుసంధానం చేసే సమయంలో అక్కడి మోనార్క్ అపార్టుమెంట్ వాసులు అభ్యతరం చెప్పడంతో పెద్ద పైప్‌లైన్‌కు బదులుగా తక్కువ సామర్థ్యం ఉన్నవి వేశారన్నారు. దీంతో తరచూ అక్కడి తక్కువ సామర్థ్యం గల పైప్‌లైన్ నుంచి మురుగు నీరు వెనక్కు వస్తున్నాయని దారులను, సంస్కృతీ సన్వార్ అపార్టుమెంట్ బీ బ్లాక్ పార్కింగ్ సెల్లార్‌నూ ముంచెత్తుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం కార్పొరేటర్ పవన్‌కుమార్ జలమండలి అధికారులతో మాట్లాడుతూ బాలాజీనగర్ రోడ్ నెం.4, 5లో తలెత్తిన సమస్య తీవ్రతను గుర్తించాలని, తాత్కాలికంగా మొదట సంస్కృతి సన్వార్ అపార్టుమెంట్ సెల్లార్‌లోకి చేరిన మురుగునీరు తొలగించే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాలనీ ప్రతినిధులు యాదయ్య, సూర్య తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో హెచ్ఎంలు విజయ, సత్తయ్య, పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

చంపాపేట, జూన్ 6(ఆంధ్రజ్యోతి): చంపాపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంను ఘనంగా జరుపుకున్నారు. 2009, 2010 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న 58మంది విద్యార్థులు సమావేశమై తమ గురువులైన ప్రధానోపాధ్యాయులు సత్తయ్య, విజయ, ఉపాధ్యాయులు మురళి, రాధాకృష్ణ, వెంకన్న, అక్బర్, శ్రీనివాస్‌రెడ్డి, స్వర్ణలత, జయశ్రీ, చంద్రకాంత్, వాసుదేవ్‌లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు ఎక్కడెక్కడో స్థిరపడ్డ వారందరు ఒకేచోట కలుసుకొని పాత జ్ఞాపకాలను నెమరేసుకొని తమ సంతోషం వ్యక్తం చేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు రాము, లక్ష్మణ్, హరిత, ఖాసీం, జ్యోతి, అనిల్, రమేష్, వినోద్, శేఖర్, కళ్యాణి, డేవిడ్, మునీర్, అంజి, ప్రవీణ్, రాజశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సరైన పత్రాలు చూపించి వాహనాలు తీసుకెళ్లండి

కొత్తపేట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): చలానాలు చెల్లించి, సరైన పత్రాలు చూపించి పట్టుబడిన వాహనాలను తీసుకెళ్లవచ్చని ఎల్బీనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జగదీష్ వాహనదారులకు గురువారం ఒక ప్రకటనలో సూచించారు. ఎల్బీనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ రకాల కేసుల్లో 83 బైకులను స్వాధీనం చేసుకున్నామని, వాహన యజమానులకు నోటీసులు ఇవ్వడంతో పాటు సమాచారం ఇచ్చామని, స్టేషన్‌కు వచ్చి సరైన పత్రాలు చూపిస్తే అందజేస్తామని తెలిపారు. మరింత సమాచారం కోసం సెల్: 8712662773, 8712662446, 8712662447 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని యాచకుడు మృతి



గుర్తు తెలియని యాచకుడు

కొత్తపేట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ పీఎస్ పరిధిలో భిక్షాటన చేసే గుర్తు తెలియని యాచకుడు (40-45) ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్ఐ మధు కథనం ప్రకారం.. ఈనెల 3వ తేదీన సిరీస్ రోడ్డులో బ్లూకోల్ట్ పోలీసులు అపస్మారక స్థితిలో పడి ఉన్న గుర్తు తెలియని యాచకుడిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. యాచకుడు చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

ఉప ఎన్నికలు ఎప్పుడో?

- గ్రేటర్‌లో నాలుగు డివిజన్లు ఖాళీ
- ఇద్దరు కార్పొరేటర్ల అకాల మరణం
- ఎమ్మెల్యేలుగా ఎన్నికైన మరో ఇద్దరు



హైదరాబాద్ సిటీ, జూన్ 6(ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో నాలుగు డివిజన్లు ఖాళీ అయ్యాయి. రెండు స్థానాల్లో కార్పొరేటర్లు మరణించగా.. ఓ కార్పొరేటర్ ఎమ్మెల్సీగా, మరో కార్పొరేటర్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. దీంతో ఆయా స్థానాలకు ఉప ఎన్నికలు జరగాల్సి ఉంది. గుడిమల్కాపూర్ నుంచీ బీజేపీ తరఫున కార్పొరేటర్‌గా ఎన్నికైన దేవర కరుణాకర్ 2023, జనవరిలో అనారోగ్యంతో మరణించారు. ఆరు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మెహిదీపట్నం కార్పొరేటర్ మహ్మద్ మాజీద్ హుస్సేన్ (ఎంఐఎం) నాంపల్లి శాసనసభ్యుడిగా, రామ్నాస్‌పుర కార్పొరేటర్ మహ్మద్ ముబీన్ బహదూర్‌పురా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఎర్రగడ్డ డివిజన్ నుంచి విజయం సాధించిన ఎంఐఎం కార్పొరేటర్ షాహిన్ బేగం ఇటీవల చనిపోయారు. గ్రేటర్‌లో 150 డివిజన్లు ఉండగా.. వివిధ కారణాలతో నాలుగు డివిజన్లు ఖాళీ అయ్యాయి. ప్రస్తుతం కౌన్సిల్‌లో 146మంది కార్పొరేటర్లు మాత్రమే ఉన్నారు. జీహెచ్ఎంసీ చట్టం 1955ప్రకారం.. కార్పొరేటర్ మరణించిన నాలుగు నెలల్లో ఉప ఎన్నికలు నిర్వహించాలి.

దేవర కరుణాకర్ మరణించి యేడాదిన్నర కాగా.. మరో ఇద్దరు కార్పొరేటర్లు శాసనసభ్యులుగా ఎన్నికై ఆరు నెలలు దాటింది. అయినా ఇప్పటి వరకు ఉప ఎన్నికలు నిర్వహించలేదు. ఖాళీ అయిన డివిజన్ల వివరాలు పంపుతూ.. ఉపఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని గతంలో పలుమార్లు ఎన్నికల సంఘానికి జీహెచ్ఎంసీ లేఖ రాసింది. షాహిన్ బేగం మరణం నేపథ్యంలో గురువారం ఎర్రగడ్డ స్థానం ఖాళీ అయ్యిందని పేర్కొంటూ కమిషనర్ ఆమోదం తీసుకున్నారు.

ఎన్నికల విభాగం ద్వారా ఈ ఫైల్‌ను త్వరలో రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంపనున్నారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో ఉప ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటుందా..? అన్నది చూడాలి.

కేబీఆర్ వాక్ వేలో థీమ్ పార్కులు..!

- మెరుగైన నిర్వహణ చేపట్టాలని అదనపు కమిషనర్ ఆదేశం



అధికారులతో కలిసి పార్కులో పర్యటిస్తున్న సునందారాణి

హైదరాబాద్ సిటీ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కేబీఆర్ పార్కు వాక్ వేలో థీమ్ పార్కులు అందుబాటులోకి వచ్చాయి. హెర్బల్, మెడిసినల్, ఈక్సోరా, ఫైకస్.. తదితర థీమ్‌లతో పది పార్కులను జీహెచ్ఎంసీ ఇటీవల అభివృద్ధి చేసింది. వర్షాల నేపథ్యంలో ఆ పార్కుల్లో నిర్వహణ ఎలా ఉంది..? వరద నీరు వృథాగా పోతుందా..? అన్నది అర్బన్ బయోడైవర్సిటీ విభాగం అదనపు కమిషనర్ డాక్టర్ కె.సునందారాణి గురువారం పరిశీలించారు. కేబీఆర్ పార్కు లోపల, చుట్టూ ఉన్న వాక్ వేలో వాకింగ్, జాగింగ్ కోసం ఉదయం, సాయంత్రం పౌరులు వస్తుంటారు. వీరికి ఉపయుక్తంగా ఉంటుందన్న ఉద్దేశ్యంతో వాక్ వేలో అందుబాటులో ఉన్న స్థలంలో అక్కడక్కడ మినీ థీమ్ పార్కులను బల్దియా అభివృద్ధి చేసింది. ఆ పార్కుల్లో నిర్వహణ పనులు మెరుగుపర్చాలని, ట్రిమ్మింగ్, స్వీపింగ్, గ్రీన్ వేస్ట్ తొలగింపు, ఖాళీ స్థలాల్లో ప్లాంటేషన్ వంటివి వెంటనే చేపట్టాలని సునందారాణి అధికారులను ఆదేశించారు. డ్రిప్ ఇరిగేషన్ ద్వారా థీమ్ పార్కుల్లో మొక్కలకు నీటిని అందించే విషయంపై చర్చించారు. వాక్ వేలో మెట్లు, కెర్బ్ వాల్ పెయింటింగ్, చుట్టూ ఉన్న రాతి కుర్చీల మరమ్మతు, బసవతారకం కేన్సర్ ఆస్పత్రి వద్ద వాక్ వే వైపు చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పాత్ వే పైకి వస్తోన్న వరద, మురుగునీటిని మళ్లించాలని, పాడైన గ్రిల్స్ స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయా పనులు పూర్తయ్యేలా సంబంధిత విభాగాలతో సమన్వయం చేసుకోవాలని అర్బన్ బయోడైవర్సిటీ డిప్యూటీ డైరెక్టర్‌ను ఆమె ఆదేశించారు.

రాష్ట్రంలో క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం

- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



త్రోబాల్ ఆటను ప్రారంభిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

హయత్‌నగర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్టేట్ త్రోబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం హయత్‌నగర్‌లోని వర్డ్ అండ్ డీడ్ ఎడ్యుకేషన్ అకాడమీ ఆవరణలో 47వ సీనియర్ నేషనల్ త్రోబాల్ ఛాంపియన్ షిప్ పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడలకు అధిక ప్రాధాన్యతను ఇవ్వడం జరుగుతుందని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి క్రీడల పట్ల మక్కువ ఎక్కువ అని అన్నారు. తెలంగాణకు ఛాంపియన్ షిప్ తీసుకురావాలని క్రీడాకారులను కోరారు. స్పోర్ట్స్ పాలసీని తీసుకురావడానికి నా వంతు కృషి చేస్తానన్నారు. ఇరవై సంవత్సరాల క్రితం ఉద్యోగ అవకాశాల్లో స్పోర్ట్స్ కోటా ఉండేదని గుర్తుచేశారు. ఇప్పుడు ఆ అవకాశం లేదన్నారు. ప్రభుత్వం క్రీడాకారులకు అన్ని విధాలుగా సహకరిస్తుందన్నారు. త్రోబాల్ ఛాంపియన్ షిప్‌పోటీలకు దేశంలోని 26 రాష్ట్రాల పురుషులు, మహిళా టీంలు వచ్చాయి. మూడు రోజుల పాటు ఈ పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారి, తెలంగాణ స్టేట్ త్రోబాల్ అసోసియేషన్ చైర్మన్ ప్రేంసాగర్‌రావు, టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యుడు విఠల్, అమీర్ అలీఖాన్, అధ్యక్షుడు సత్యం శ్రీరంగం, వర్కింగ్ ప్రెసిడెంట్ రవికుమార్, ఉపాధ్యక్షుడు కృష్ణా రాజ్‌పుత్, చిత్ర, జమీల్, కృష్ణారెడ్డి, కాంగ్రెస్ నాయకుడు గజ్జి భాస్కర్‌యాదవ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రొ. జయశంకర్ బడిబాట కార్యక్రమం ప్రారంభం



కోహెడలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

హయత్‌నగర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించుటకు ప్రభుత్వం చేపట్టిన ప్రొ. జయశంకర్ బడిబాట కార్యక్రమం గురువారం నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభమైంది. తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని రాగన్నగూడ, కమ్మగూడ, తుర్కయంజాల్, ఇంజాపూర్, బ్రాహ్మణపల్లి, తొర్రూర్, మునగనూర్ పాఠశాలల్లో బడిబాట కార్యక్రమం ప్రారంభమైంది. కొహెడా జిల్లా పరిషత్ పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ, ఆశ వర్కర్స్‌తో ఉపాధ్యాయులు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బడి ఈడు పిల్లలను ఎలా గుర్తించి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలో ఉపాధ్యాయులు వివరించారు. అనంతరం గ్రామంలో విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. ఈనెల 19వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని ప్రిన్సిపాల్ తిరుపతిబాయి తెలిపారు. ప్రతి రోజు ఒక కార్యక్రమం తీసుకుని బడి బాటను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ(ఏఏపీసీ) చైర్మన్ స్వప్న, ఉపాధ్యాయులు దన్నె రాజు, జగన్‌రాజు, నర్సింహ, లక్ష్మణ్, గోపాల్‌రెడ్డి, రాధ మాధవి, కొండయ్య, మంజుల, జగదీశ్వరచారి, కృష్ణకుమార్, వెంకటేశ్ పాల్గొన్నారు.

మేయర్ పీఠాన్ని దక్కించుకునేందుకు కాంగ్రెస్ కుట్రలు

- మేయర్ జక్క వెంకట్‌రెడ్డి

పీర్జాదిగూడ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పీఠాన్ని దక్కించుకోవాలని ఐదు నెలలుగా కాంగ్రెస్ నాయకులు కుట్రలు, డ్రామాలు, అనైతిక చర్యలకు పాల్పడుతున్నారని స్థానిక మేయర్ జక్క వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం పీర్జాదిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారం కోసం కాంగ్రెస్ నాయకులు కుట్రలు చేస్తున్నారని అన్నారు. నా మీద నేనే బల నిరూపణకు వెళ్లానని జక్క వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. బల నిరూపణకు వెళ్లే సమయంలో నాపై కలెక్టర్‌కు, ఆ తరువాత పోలీసులకు ఫిర్యాదు చేసిన కార్పొరేటర్లు నాకు మద్దతుగా ఉన్నారు. తదనంతరం ప్రలోభాలకు లొంగి నాపై తప్పుడు ఫిర్యాదులు చేశారని అన్నారు. చివరి ప్రయత్నంగా పోలీస్‌స్టేషన్‌లో తప్పుడు ఫిర్యాదు చేయించి అవిశ్వాసాన్ని అడ్డుకున్నారని తెలిపారు. కానీ, కలెక్టర్‌పై అధికార కాంగ్రెస్ నాయకులు ఒత్తిడి తేవడంతో కలెక్టర్ చట్ట విరుద్ధంగా అవిశ్వాసం ఆపాలని ఆర్డర్ జారీ చేశారని అన్నారు. అవిశ్వాసం ప్రక్రియను పూర్తి చేసేందుకు కోర్టు అభ్యంతరం లేకున్నా సభ్యుల ప్రాథమిక హక్కును భగం కలిగిస్తూ, మున్సిపల్ యాక్ట్ క్లాజ్ 10(1) పేజీ నెంబర్ 416కి విరుద్ధంగా మేడ్చల్ జిల్లా కలెక్టర్ తనకు లేని అధికారాలను కల్పించుకుని అధికార పార్టీ ఒత్తిళ్ళకు తలొగ్గి ఆర్డర్ జారీ చేశారని పేర్కొన్నారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి కలెక్టర్ ఈ విధంగా చేయడం సమంజసం కాదని ఆయన అన్నారు. బలం ఉంటే కాంగ్రెస్ నాయకులు తమ బలాన్ని అవిశ్వాసంలో నిరూపించుకోవాలని, ఈ నంగనాచి వేశాలు ఎందుకని పేర్కొన్నారు.

బీసీ రిజర్వేషన్లు, హక్కుల సాధనకు పోరాటాలకు సిద్ధం

- 15న ఇందిరాపార్కు వద్ద మహాధర్నా



అభివాదం చేస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య, ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్, రాజారాంయాదవ్, సంఘాల నాయకులు

పంజాగుట్ట: రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల పెంపు, వాటి హక్కుల సాధన కోసం మిలిటెంట్ పోరాటాలకు సిద్ధం కావాలంటూ పలువురు వక్తలు పిలుపునిచ్చారు. రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. బీసీ జనసభ అధ్యక్షుడు రాజారాం అధ్యక్షతన గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'కామారెడ్డి డిక్లరేషన్-సమగ్ర కులగణన' అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్, గిరిజన రిజర్వేషన్ సాధన సమితి చైర్మన్ సంజీవ్ నాయక్, వివిధ బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల హక్కుల సాధన కోసం ఈనెల 15న ఇందిరాపార్కు వద్ద మహాధర్నాకు పిలుపునిచ్చారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలు కోసం బీసీ సంఘాలు ఐక్యం కావాల్సిన అవసరం ఉందని ఆర్.కృష్ణయ్య అన్నారు. అధికార కాంగ్రెస్ పార్టీకి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా.. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఆర్డినెన్స్ తేవాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. బీసీలను మరోసారి మోసగించేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమైందని, రిజర్వేషన్ల సాధన కోసం ఎలాంటి కార్యాచరణ తీసుకున్నా.. తాను ఎప్పుడూ ముందుంటానని అన్నారు. సమావేశంలో రాజారాంయాదవ్ వివిధ బీసీ సంఘాల నాయకులు కాటం నర్సింహ యాదవ్, పోచబోయిన శ్రీహరి యాదవ్, సాయిని నరేందర్, బత్తుల సిద్ధేశ్వర్, రమేష్ యాదవ్, ఎలక్ట్రానిక్ మీడియా తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం అధ్యక్షుడు రమణ కుమార్, టి.జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి క్రిష్ణ, హరి, వెంకటేష్, దత్తాత్రేయ పాల్గొన్నారు.

మునగనూర్ కాల్వపై అక్రమ నిర్మాణాలు..
బిల్డర్‌తో పాటు మరో ఇద్దరిపై కేసు

- కాల్వను పరిశీలించిన డీఈఈ ఉషారాణి



మునగనూర్‌లో ఇరిగేషన్ కాల్వపై నిర్మించిన కట్టడాలను పరిశీలిస్తున్న ఇరిగేషన్ శాఖ డీ.ఈ.ఈ. ఉషారాణి, ఏ.ఈ. తస్వీన్ రజా

హయత్‌నగర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఇంజాపూర్ దిలావర్‌ఖాన్ చెరువు నుంచి మునగనూర్ మీదుగా పెద్దఅంబర్‌పేట్ ఈదుల చెరువు వరకు ఉన్న 33 ఫీట్ల కాల్వపై జరుగుతున్న అక్రమ నిర్మాణాలను గురువారం ఇరిగేషన్‌శాఖ డీఈఈ ఉషారాణి, ఏఈ తస్వీన్ రజాతో కలిసి పరిశీలించారు. మునగనూర్ బలహీనవర్గాల కాలనీ వెనుక రొట్టెలోని గుట్ట కింద నుంచి ఉన్న 33 ఫీట్ల కాల్వపై బిల్డర్లు నిర్మిస్తున్న భవనంతో పాటు మరో నిర్మాణాలను పరిశీలించారు. పూర్తిగా కాల్వను ఆక్రమించి నిర్మిస్తున్నారని తెలుసుకున్న అధికారులు అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్న వెంకటేశ్వర్‌రెడ్డి, సత్యనారాయణ, శ్రీనివాస్‌లపై హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ముగ్గురిపైన కేసు నమోదు చేశారు.

కూల్చివేస్తారా? లేదా?

కాల్వపై అక్రమ నిర్మాణాలు పరిశీలించి వెళ్లిన ఇరిగేషన్ అధికారులు కేసులతో సరిపెడతారా లేక కూల్చివేసి కాల్వను చేస్తారా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది. బిల్డర్‌తో పాటు మరో ఇద్దరిపైన కేసులు చేసిన అధికారులు కాల్వను మొత్తం తిరిగి చూశారు. కాల్వ మొత్తం ఆక్రమణలోనికి వెళ్లినట్లు గుర్తించారు.

కొందరు తాము ప్లాటు కొనుగోలు చేశామని అధికారులతో చెప్పారు. కాల్వపైన ఎలాంటి నిర్మాణాలు చేయవద్దని అధికారులు అన్నారు. ఇదిలా ఉండగా ఆక్రమణదారులు ఫిర్యాదుదారులకు ఫోన్‌లు చేసి ప్రలోభ పెట్టడానికి ఆఫర్‌లు ఇస్తున్నారని తెలిసింది. ఇప్పటికైనా అధికారులు ప్రజా ఉపయోగకరంగా ఉన్న సాగునీటి కాల్వను ఆక్రమణ నుంచి తొలగించి సాఫీగా సాగునీరు ఈదుల చెరువుకు వెళ్లేలా చేయాలని స్థానికులు కోరుతున్నారు.



కేక్ కట్‌చేసి సంబరాలు నిర్వహించుకుంటున్న టీడీపీ నాయకులు

టీడీపీ కూటమి విజయం సాధించడం చరిత్రాత్మకం

వనస్థలిపురం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఏపీలో టీడీపీ కూటమి భారీ విజయాన్ని అందుకోవడం చరిత్రాత్మక విషయమని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు గద్దె విజయ్‌నేత అన్నారు. గురువారం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సచివాలయనగర్‌లోని కార్పెంటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టీడీపీ విజయోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విజయ్‌నేత మాట్లాడుతూ ఏపీలోని సబ్బండవర్గాల మద్దతుతో చంద్రబాబునాయుడు సారథ్యంలోని టీడీపీ కూటమి అఖండ విజయాన్ని సాధించడం సంతోషకరం అన్నారు. అనంతరం కేక్ కట్‌చేసి, టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ డివిజన్ తెలుగు యువత అధ్యక్షుడు కార్పెంటర్ శ్రీను, కార్పెంటర్ అసోసియేషన్ ప్రతినిధులు బీటీ ప్రసాద్, వీ.రామకృష్ణ, కె.శ్రీనివాస్‌రావు, నాగపండు, కెవి రమణ, భద్ర, సత్తిబాబు, బ్రహ్మ, నర్సింహారావు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులను అభినందిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

వనస్థలిపురం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ నూతన కమిటీని గురువారం వనస్థలిపురంలో జరిగిన జనరల్‌బాడీ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షురాలిగా ముకిరి శృతి, ప్రధాన కార్యదర్శిగా పి.వెంకటరమణ, కోశాధికారిగా సైదులుని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షురాలు శృతి మాట్లాడుతూ తెలంగాణాలోని మారుమూల గ్రామాల్లో ఆసక్తితో ఉండే యువతి, యువకులను ప్రోత్రహిస్తామని తెలిపారు. తమ నియామకానికి కృషి చేసిన అసోసియేషన్ ప్రతినిధులకు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

గోవుల అక్రమ రవాణా నియంత్రణ చర్యలు చేపట్టండి



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న వీహెచ్‌పీ గోరక్షా ప్రతినిధులు

సైదాబాద్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): బక్రీద్ పండుగ సందర్భంగా గోవుల అక్రమ రవాణా, గోవధను నియంత్రించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్ గోరక్షా విభాగం ఆధ్వర్యంలో గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో గోరక్షా చట్టాలను పటిష్టంగా అమలుచేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. గో ఆధారిత వ్యవసాయం, పంచగవ్య చికిత్సలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో క్షేత్ర గోసేవా ప్రముఖ్ ఆకుతోట రామారావు, వీహెచ్‌పీ ప్రముఖ్ యాదగిరిరావు, బాలకృష్ణ గురుస్వామి, జస్మత్ బాయ్ పటేల్, వెంకన్న, రమేష్, మల్లేష్‌గౌడ్ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

సైదాబాద్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు సైదాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కరణ్‌బాగ్‌లో నివాముండే విజయవాడకు చెందిన కందవల్లి నాగేశ్వర్‌రావు(62) గత నెల 30న ఇంటి నుంచి వెళ్లాడు. తిరిగి రాకపోయేసరికి కుటుంబ సభ్యులు గాలించారు. ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.